

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## నీ ఇల్లు

**తన ఫోన్ మోగడం** విని వంటింట్లో బిజీగా ఉన్న అవని ఫోన్ వంక విసుగ్గా చూసింది. ఈ సమయంలో సాధారణంగా తనకెవరూ ఫోన్ చేయరు. రాత్రి ఎనిమిది అంటే తనకి ఊపిరాడనంత పని అని వాళ్ళకి తెలుసు. పెనం మీద చపాతీని వెనక్కి తిప్పి, ఫోన్ అందుకుంది.

సుష్మనించి.

ఆమె మనసు ఆనందంతో నిండిపోయింది. ఎన్ని రోజులైందో సుష్మతో మాట్లాడి. 'నువ్వు కాల్ చేయద్దు. నేనే వీలున్నప్పుడు చేస్తాను' అని ఆంక్ష పెట్టిన సుష్మ నెలకోసారి కూడా ఫోన్ చేయదు. ఈసారి రెండునెలలు దాటింది.

ఫోన్ ఆన్ చేసి చెప్పింది.

"హలో సుష్మా. ఎన్ని రోజులకి? చెప్పు. ఏమిటి సంగతులు?"

"అవనీ నేను మీ ఇంటికి వచ్చి ఓ పదిరోజులు ఉండచ్చా?" సుష్మ కంఠం నీరసంగా వినిపించింది.

"అయ్యో! అడగాలా? వచ్చెయ్. ఐనా ఏమైంది? వాసుతో ఎప్పటి గోలేనా?" అవని సానుభూతిగా అడిగింది.

"మీ వారిని, అత్తగారిని అడిగి చెప్పు. లైన్‌లో ఉంటాను" సుష్మ ఆ మాటలు పట్టించుకోకుండా చెప్పింది.

"పర్లేదు. నేను తర్వాత చెప్తాను. నువ్వొచ్చెయ్"

"ఐదు నిమిషాల్లో మళ్ళీ కాల్ చేస్తా అవనీ. వాళ్ళు ఏమందీ నిర్మొహమాటంగా చెప్పు" సుష్మ ఫోన్ పెట్టేసింది.

అవని స్టవ్ ఆపి హాల్‌లోకి వెళ్ళింది. అత్తగారు సోఫాలో కూర్చుని టి.విలో సీరియల్ చూస్తున్నారు. చంద్రం ఆమె పక్కన కూర్చుని లేప్‌టాప్‌లో ఏదో పనిచేసుకుంటున్నాడు.

"మా ఫ్రెండ్ సుష్మ మనింటికి వచ్చి ఓ పదిరోజులు ఉండచ్చా అని అడుగుతోంది" అవని భర్తతో చెప్పింది.

వెంటనే అతను విసుగ్గా లాప్ టాప్ మూసి ఆమెవంక కోపంగా చూస్తూ అరిచాడు.

"ఎందుకు ఇలాంటివన్నీ నెత్తిన పెట్టుకుంటావు? మర్నాడు వాళ్ళాయన వచ్చి నా పెళ్ళాన్ని వీళ్ళింట్లో ఉంచుకుని కాపురానికి పంపడంలేదని నానాగొడవ చేస్తాడు. పోలీస్ కంప్లయింట్ ఇస్తాడు. అవసరమా మనకి ఇవన్నీ?"

"మీరిద్దరూ ఆఫీసుకి పొయ్యాక ఆ పిల్ల నా పీక నొక్కి నా బంగారం, ఇల్లు దోచుకుపోతే, ఎందుకొచ్చిన తద్దినం?" అత్తగారు రాగయుక్తంగా చెప్పింది.

అవని వంటగదిలోకి వెళ్ళి స్టవ్ ఆన్ చేసి చపాతీలు చేయసాగింది. ఫోన్ మోగింది.

"ఏమన్నారు?" సుష్మ అడిగింది.

అవని జవాబు చెప్పలేదు.

"నాకు తెలుసు. చదువుకుని ఉద్యోగం చేస్తున్నావు కాబట్టి నువ్వు నాకంటే కొంచెం బెటర్‌గా ఉన్నావు" సుష్మ శుష్కంగా నవ్వింది.

"సారీనే" అవని గొంతు దుఃఖంతో పూడుకుపోయింది.

"పర్లేదు. అనుకున్నా కానీ ఏదో ఆశ ఫోన్ చేయించింది. బై అవని" సుష్మ ఫోన్ పెట్టేసింది.

ఉదయం ఆరుగంటలకే ఫోన్ మోగడంతో అవని ఎవరా అని చూసింది. తల్లినించి. కాఫీ కప్ అందుకుని ఫోన్‌తో బాల్కనీలోకి వెళ్ళింది.

"అమ్మా! ఏంటి? ఇంత పొద్దున్నే?"

"అన్యాయం జరిగిపోయింది బుజ్జమ్మా" తల్లి కంఠం గద్గదంగా వినిపించింది.

అవని కంగారుగా కాఫీ కప్ టీపాయ్ మీద పెట్టి ఆత్రంగా అడిగింది.

"ఏమైందమ్మా?"

"నీ ఫ్రెండ్ సుష్మ ఉరేసుకుని చచ్చిపోయిందిటే!"

"ఏమిటి?" అవనికి ప్రపంచమంతా గిర్రున తిరుగుతున్నట్లనిపించింది.

"వాళ్ళింటి పక్కవాళ్ళు ఫోన్ చేసారు. తమ్ముడు వెళ్ళొచ్చాడు. ఒంటినిండా వాతలు, దెబ్బలు కనిపిస్తున్నాయిట. రెండురోజులుగా వాసు ఆమెని ఒకటే హింసిస్తున్నాడని పక్కవాళ్ళు చెప్పారుట. పాపం! చెప్పుకోడానికి ఆ పిల్లకి తల్లీ, తోడులేకపోతిరి" ఆవిడ బాధగా చెప్పింది.

"అమ్మా సుష్మ రాత్రి నాకు ఫోన్ చేసింది. పదిరోజులు మీ ఇంటికి వచ్చి ఉండచ్చా అని అడిగింది. చంద్రం, వాళ్ళమ్మ ఒప్పుకోలేదు" అవని ఏడుస్తూ చెప్పింది.

"అయ్యో! నా దగ్గరకి వెళ్ళమని చెప్పాల్సింది. వాడితో పడలేక ఎక్కడికి వెళ్ళాలో తెలీక ప్రాణాలు తీసుకుంది. ఇక్కడికి వచ్చినా తమ్ముడు ఏదో చిన్న ఉద్యోగం చూసేవాడు. కానీ ఊళ్ళోనే ఇంకో ఇంట్లో ఉంటే వాడు రెచ్చిపోతాడని వచ్చి వుండదు."

అవని కాల్ కట్ చేసి ఫోన్ వంకే చూస్తూండిపోయింది. ప్రపంచంలో వెళ్ళేందుకు మరో చోటు లేక సుష్మ ప్రాణాలు తీసుకుంది. ఏకైక స్నేహితురాలైవుండీ, తనేం సాయం చేయలేకపోయింది. బహుశా వాసు రాత్రి ఇంటికి వచ్చేలోగా, తన ఊరి బస్ఎక్కి వచ్చేయాలనుకుంది. తన దగ్గరుండి, ఆ బంధంలోంచి బయటపడాలనుకుంది. జీవితం మీద, ప్రాణాలమీద ఆశతో చివరి ఫోన్ కాల్ చేసింది. 'చదువుకుని, ఉద్యోగం చేస్తున్నావు కాబట్టి నువ్వు నాకంటే కొంచెం బెటర్' సుష్మ మాటలు గుర్తొచ్చాయి.

అవనికి దుఃఖం పొంగుకువచ్చింది.

ఎనిమిదిన్నరకి మెలుకువ వచ్చి టైం చూసుకున్న చంద్రం కోపంగా బయటికి వచ్చాడు. తల్లి టి.వి చూస్తూ కాఫీ తాగుతోంది.

"అవనీ. టైంకి నిద్రలేపాలని తెలీదా? ఈ మధ్య నీకు పొగరెక్కింది" అరుస్తూ వంటగదిలోకి వెళ్ళాడు. ఆమె కనిపించలేదు.

హాల్లోకి వచ్చి తల్లినడిగాడు.

"ఏది?"

"ఏమో నాకేం తెలుసు? మీగదిలో లేదా? పొద్దున లేచి చూస్తే కనిపించలేదు. కాఫీ తాగకపోతే ప్రాణం నిలవదుగా పొయ్యిమీద పాలుంటే నేనే కాఫీ కలుపుకుని తాగుతున్నా. బాత్‌రూంలో ఉందేమో చూసావా?" ఆవిడ టి.వి మీంచి దృష్టి మరల్చకుండా, సౌండ్ తగ్గించకుండా అడిగింది.

"లేదు"

చంద్రం బాల్కనీ తలుపు తీసాడు. అవని కుర్చీలో కూర్చుని శూన్యంలోకి చూస్తోంది. టీపాయ్ మీద కప్‌లో కాఫీ మీగడ కట్టివుంది. ఆమె కళ్ళు ఎర్రగా వాచి వున్నాయి.

"ఎవరు చచ్చారని పొద్దున్నే తీరిగ్గా కూర్చుని ఏడుస్తున్నావ్?" అరిచాడు.

"సుష్మ" అతనివంక చూస్తూ చెప్పింది.

చంద్రం ఓ క్షణం తడబడ్డాడు. మరేం మాట్లాడే ధైర్యం చేయలేక లోపలకి వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత మూడురోజులు అవని ఆఫీస్‌కి వెళ్ళలేదు. పడకగది దాటి బయటకి రాలేదు భోజనం ఆర్డర్ చేసుకుని తిన్నది. అత్తగారు సణుక్కుంటూ గొణుక్కుంటూ కొడుక్కి, తనకీ వంట చేసుకోవడం తెలుస్తోంది కానీ పట్టించుకోలేదు.

ఆమెకి సుష్మ మాటలు పదేపదే గుర్తొస్తున్నాయి. నిజమే. ఈ జాబ్ లేకపోతే తనకీ పాటి విలువ కూడా ఉండేది కాదు. విలువ ఉందా నిజంగా? 'నా దగ్గరకి వెళ్ళమని చెప్పాల్సింది చూసుకునేదాన్ని' అని తల్లి ఎంతో సులువుగా అనేసింది. మరి తనెందుకు 'వచ్చెయ్' అనలేకపోయింది? నిజానికి అన్నది. కాని ఎందుకు భర్త అనుమతి అడగక్కర్లేదులే రా అని సుష్మతో అనలేదు. అవనికి తనమీద తనకే అసహ్యం వేసింది. నాలుగోరోజు శనివారం చంద్రం భార్యతో చిరాగ్గా చెప్పాడు.

"ఇంకా ఎన్నిరోజులు? అయిందేదో అయింది. ఇంక రొటీన్‌లోకి రా ఇన్ని రోజులు లీవ్ పెడితే ఉద్యోగం ఊడుతుంది. లే"

అవని మౌనంగా లేచి కాఫీ కలుపుకుని హాల్లోకి వచ్చింది. అత్తగారు టి.వి చూస్తున్నారు చంద్రం పేపర్ చదువుకుంటున్నాడు.

ఆమె అత్తగారి పక్కనున్న రిమోట్ అందుకుని టి.వి ఆఫ్ చేసింది. భర్త ఎదురుగా సోఫాలో కూర్చుని చెప్పింది.

"నీతో మాట్లాడాలి చంద్రం."

అతను పేపర్ మడిచిపక్కన పెట్టాడు.

"ఇకనించి నేనీ ఇంటి ఇన్‌స్టాల్‌మెంట్స్ కట్టను. నువ్వే కట్టుకో"

"అదేం?" చంద్రం ఆగ్రహంగా అడిగాడు.

"ఎందుకంటే ఇది నా ఇల్లు కాదు"

"నీ ఇల్లు కాదా? మరి ఎవరిల్లు?"

"నా ఇల్లయితే మరి సుష్మని 'రా' అని ఎందుకనలేకపోయాను? నీ పర్మిషన్ ఎందుకు అడిగాను? నో అంటే ఎందుకు ఊరుకున్నాను? అంటే ఈ మూడేళ్ళలో 'ఇది నా ఇల్లు' అనే భావన రాకుండా నువ్వు సమర్ధవంతంగా చూసుకున్నావ్. నా ఫ్రెండ్ సుష్మ గురించి నీకు తెలుసు. వెంటబడి చదువు మానిపించి పెళ్ళి చేసుకున్న ఆ దరిద్రుడి గురించి తెల్సు. దాని బాధలు తెలుసు. ఐనా ఒక

నిస్సహాయురాలికి ఈ ఇంట్లో ఆశ్రయం లేదన్నావ్. మరి ఇది నా ఇల్లెలా అవుతుంది? దీనికి నేను నెలకి ఇరవై మూడువేలు ఇన్‌స్టాల్ మెంట్స్ ఎందుకు కట్టాలి?"

అవని అత్తగారివైపు తిరిగింది. తెల్లబోతూ చూస్తున్న ఆవిడతో చెప్పింది. "పెద్దకోడలుతో పడదు అని నా పెళ్ళయిన నెలకి వచ్చారు. మా భార్యాభర్తల సంభాషణల్లో తలదూర్చి మా గొడవలు పెంచారు. అరవై నాలుగేళ్ళ వయసుకే వంటింట్లోకి రావడం, ఇంట్లో పనులు చేయడం మానేసారు. మా అమ్మ నీతులు విని విని మిమ్మల్ని గౌరవించాను. కూర్చున్న చోటికి తెచ్చి పెట్టాను. ఐనా మీకు విశ్వాసం లేదు. నా స్నేహితురాలు మీ పీకనొక్కి బంగారం కాజేస్తుందేమో, ఇల్లు దోచుకుంటుందేమో అని మీకు అనుమానం. తల్లితండ్రులని వంతులు వేసి చూసుకునే వాళ్ళంటే నాకు అసహ్యం. కాని తప్పదు. ఇకనించి మీరు ఆర్నెల్లు పెద్దకొడుకు దగ్గిర, ఆర్నెల్లు చిన్నకొడుకు దగ్గర ఉండాలి. అలాగే మేమిద్దరం ఆఫీసుల్లోనే తినేస్తాం కాబట్టి మీ లంచ్ మీరే వండుకోవాలి. ఈ మూడు రోజులు రెండుపూటలా వండుకున్నారు కదా? ఇప్పుడే బావగారికి ఫోన్ చేస్తున్నా మిమ్మల్ని తీసుకెళ్ళమని."

చేష్టలుడిగి చూస్తున్న చంద్రంతో చెప్పింది.

"ఇది నా ఇల్లు అనే భావన వచ్చేదాకా నేనింతే. ఇష్టంలేదంటే చెప్పు. నీ ఇంట్లోంచి వెళ్ళిపోతా. యుగధర్మం ప్రకారం చెడ్డవాళ్ళకే రోజులు. అందుకే నేనూ చెడ్డగా ఉండాలనుకుంటున్నా" ఆమె సోఫాలో వెనక్కివాలి నెమ్మదిగా కాఫీ తాగసాగింది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments